క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు

బిట్రగుంట: బోగోలు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో క్షేత్రవాసి ప్రసన్న వేంకటేశ్వరస్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను దేవదాయశాఖ అధికారులు సోమవారం లెక్కించారు. మార్చి 2వ తేదీ నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభకానున్న నేపథ్యంలో ఆలయ అధికారులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. స్వామి, అమ్మవార్లకు భక్తులు హుండీలో సమర్పించిన నగదును లెక్కించగా రూ.17,63,771 వచ్చింది. హుండీ లెక్కింపు ప్రక్రియను కోవూరు దేవదాయశాఖ పరిశీలకుడు సుధీర్‌బాబు, ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, ఈఓ రాధాకృష్ణ, సభ్యులు పర్యవేక్షించారు.

వైభవంగా గంగమ్మజాతర


విశేష అలంకారంలో గంగమ్మ తల్లి

సంగం: స్థానిక పెన్నానది ఒడ్డున వెలసిన శ్రీపాలేటి గంగమ్మ తల్లి ఆలయంలో జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతోంది. జాతరలో భాగంగా రెండో రోజు సోమవారం యాదవుల ఆచారాలు వైభవంగా కొనసాగాయి. అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆచారం ప్రకారం కొమ్మలోళ్ల యువకులు పెళ్లి బట్టలు ధరించి పటాన్లెక్కే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం యువకులు భక్తిశ్రద్ధలతో వీరతాళ్లతో విన్యాసాలు చేశారు. దాత కాకు రఘురాంయాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థులకు అభినందన

సోమశిల: ఇటీవల సంగం మండలంలో ఆత్మకూరు నియోజకవర్గస్థాయిలో జరిగిన గ్రిగ్ ఆటల పోటీల్లో అనంతసాగరం మండలం రేవూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఖోఖోలో బాలుర జూనియర్స్ విభాగంలో ఛాంపియన్‌షిప్‌తోపాటు సీనియర్ బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో పోటీల్లో రన్నర్స్‌గా నిలిచారు. దీంతో విజేతలుగా నిలిచిన విద్యార్థులను సోమవారం ఆ పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ వెంకట కృష్ణయ్యకు అభినందనలు తెలిపారు.

తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైప్‌లైన్లను కమిషనర్ ఎం.రమేష్‌బాబు, కౌన్సిలర్ కామాక్షయ్యనాయుడుతో కలిసి సోమవారం పరిశీలించారు. ఇటీవల కలెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు లేఅవుట్‌లను పరిశీలించి పూర్తిసాయిలో తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే.

శనగ పంట పరిశీలన

చేజర్ల: మండలంలోని చిత్తలూరులో సాగు చేసిన శనగ పంటను నెల్లూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎం.ఓబయ్య, వి.సురేఖ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆత్మీయ సమావేశం

ఉదయగిరి: పట్టణంలోని షాదీమంజిల్‌లో మంగళవారం ఉదయం 9 గంటలకు ఉదయగిరి, వరికుంటపాడు, సీతారామపురం, దుత్తలూరు మండలాలకు సంబంధించి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డితోపాటు తాను కూడా హాజరవుతానని ఎమ్మెల్యే తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పరామర్శ

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నలతాటి నరసింహ(85) ఆదివారం మృతిచెందడంతో ఆయన మృతదేహాన్ని సోమవారం ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. నరసింహ కుమారులు బుద్దుడు, బాలయ్య, ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు.

డీడీఓ విచారణ

ఉదయగిరి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రెండ్రోజుల క్రితం ఫార్మాసిస్ట్ మందులు తరలించే నిమిత్తం ప్యాక్ చేస్తుండగా సీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యుడు ఠాగూర్ అడ్డుకొని డీడీఓ లీలావతికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సోమవారం డీడీఓ సంబంధిత ఫార్మాసిస్ట్‌ను పిలిపించి విచారించారు. అనంతరం డీడీఓ లీలావతి విలేకరులతో మాట్లాడుతూ వారం రోజుల క్రితం ఫార్మాసిస్ట్ కోట ప్రభుత్వ వైద్యశాలకు మందులు పంపే విషయమై తనతో మాట్లాడారని, ఇందులో భాగంగానే శనివారం మందులు పంపించే ప్రయత్నం చేస్తుండగా వైద్యుడు ఠాగూర్‌కు ఆ విషయం తెలియక అడ్డుకున్నారన్నారు. ఆ రోజు తాను అత్యవసర పనిమీద డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి వెళ్లినందున సోమవారం దీనిపై విచారణ జరిపామన్నారు. ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని తెలిపారు.

ర్యాగింగ్ చేయడం నేరం

జలదంకి: ర్యాగింగ్ పేరుతో సీనియర్ విద్యార్థులు జూనియర్లను ఇబ్బందులకు గురిచేయడం చట్టరీత్యా నేరమని ఎస్సై వీరేంద్రబాబు పేర్కొన్నారు. ర్యాగింగ్‌ను అరికట్టడంపై సోమవారం ఆయన స్థానిక శ్రీసాయి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు.

భద్రతకు మంగళం

పోలీసుల నిర్లక్ష్యం, కేసుల నమోదులో జాప్యంతో కావలి పరిధిలో రోజురోజుకూ నేరాల సంఖ్య పెరుగుతోంది. గొలుసు దొంగతనాలు, ఇళ్లలో చోరీలు, బైక్‌లను దొంగిలించడం తదితరాలు నిత్యకృత్యంగా మారాయి. ఇక ఆకతాయిల ఆగడాలకు హద్దే లేకుండాపోతోంది. గస్తీని కట్టుదిట్టం చేసి నేరాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాల్సిన పోలీసులు ప్రజల భద్రతకు బైబై చెప్పి తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

- కావలి పరిధిలో పెరుగుతున్న నేరాలు
- మూడు పోలీస్‌స్టేషన్లు, ముగ్గురు సీఐలు, ఆరుగురు ఎస్సైలు ఉన్నా ఫలితం శూన్యం
- గస్తీని గాలికొదిలేసి స్టేషన్‌కే పరిమితం అవుతున్న పోలీసులు
- అమలు కాని విజిబుల్ పోలీసింగ్


కావలిలోని డీఎస్పీ కార్యాలయం


కావలి మున్సిపల్ హైస్కూల్లో ఇన్వర్టర్ బ్యాటరీలు చోరీ చేసిన తర్వాత ఖాళీగా ఉన్న స్టాండ్(ఫైల్)

కావలి: పట్టణంలో శాంతిభద్రతలు గాడితప్పుతున్నాయి. జరుగుతున్న నేరాలపై పోలీసులు పట్టీపట్టనట్లు ఉండడంతో అసాంఘిక శక్తులు చెలరేగిపోతున్నాయి. పట్టణ పరిధిలో చోరీలతోపాటు ఆకతాయిల ఆగడాలు హెచ్చుమీరుతున్నా పోలీసులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. హైవేకి, రైల్వే కనెక్టివిటీతోపాటు వస్త్రవ్యాపారంలో ప్రసిద్ధి చెందిన కావలికి ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. బయట ప్రాంతాల వ్యక్తుల రాకపోకలు ఎక్కువగా ఉండడంతోపాటు జిల్లాలోని నేరస్తులతోపాటు ప్రకాశం, చీరాల, చిత్తూరు జిల్లాలకు చెందిన దొంగలు కూడా కావలిని కేంద్రంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఘటనలు తరుచుగా చూస్తున్నాం. ఈ క్రమంలో గస్తీ కట్టుదిట్టం చేసి నేరాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాల్సిన పోలీసులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు.

విజిబుల్ పోలీసింగ్ ఎక్కడా..?

కావలి పట్టణం పరిధిలో మూడు పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వీటిలో ముగ్గురు సీఐలు, ఆరుగురు ఎస్సైస్థాయి అధికారులు ఉన్నప్పటికీ, పట్టణ ప్రజలకు భద్రత విషయంలో భరోసా కల్పించడంలో ఘోరంగా విఫలమైనట్లు పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్పీ సీహెచ్ విజయరావు పదేపదే చెబుతున్న విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని పోలీసులు పక్కన పెట్టి స్టేషన్‌లకే పరిమితమవుతున్నారు. వ్యాపారులు, వినియోగదారులతో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు, చోరీలకు ఆస్కారం ఎక్కువగా ఉండే శివారు ప్రాంతాల్లో కూడా రాత్రి గస్తీ నిర్వహించడం లేదని ప్రజల నుంచి విమర్శలు ఉన్నాయి. పోలీసుల నిర్లక్ష్యంతో గొలుసు దొంగతనాలు, బైక్‌ల చోరీలు, ఇళ్లలో చోరీలు తరచుగా జరుగుతున్నాయి. బాధితులు స్టేషన్‌కు వస్తే సర్దిచెప్పి పంపుతున్నారే తప్ప కేసులు నమోదు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమ గోడు చెప్పుకుంటున్నా, కనీసం కేసు నమోదు చేయడానికి కూడా కావలి పోలీసులు ఇష్టపడడం లేదని విమర్శలు ఉన్నాయి.

ఆకతాయిలకు అడ్డేదీ..?

కావలిలో ఉన్న ప్రధాన రోడ్లయిన ట్రంక్‌రోడ్డు, ఉదయగిరి రోడ్లలో ఆకతాయి యువత బైక్ సైలెన్సర్ల నుంచి భయంకరమైన శబ్దాలతో నిత్యం అతివేగంగా చక్కర్లు కొడుతున్నా పోలీసులు అడ్డుకొని నివారించడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే మద్యంప్రియులు రైల్వేస్టేషన్ కూడలి పరిసర ప్రాంతాల్లో, ఆర్టీసీ, ఒంగోలు బస్టాండ్లు, తుమ్మలపెంట రోడ్డు సెంటర్, జనతాపేట తదితర చోట్ల విచ్చలవిడిగా వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా పాఠశాలలు, కళాశాలలు, ఇంజినీరింగ్ కాలేజీల వద్ద పోకిరీలు ఆగడాలు నిత్యకృత్యంగా మారాయి. వీటికి సమీపంలో ఉన్న షాపుల వద్ద బహిరంగంగా మద్యం తాగి ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం నిత్యం జరుగుతున్నాయి.

గస్తీకి మంగళం

పట్టణంలో రాత్రిపూట గస్తీకి పోలీసులు పూర్తిగా మంగళం పాడారు. గతంలో డీఎస్పీ స్థాయి అధికారులే రాత్రులు స్వయంగా పర్యటించి గస్తీని పర్యవేక్షించేవారు. పగలు కూడా ప్రధాన కూడళ్లలో పోలీసుల కదలికలు కనిపించేలా జాగ్రత్తలు తీసుకునేవారు. దీంతో నేరాలు చేసేందుకు నేరస్తులు భయపడేవారు. ప్రస్తుతం గస్తీ అనే మాటే వినిపించకపోవడంతో నేరస్తుల ఆగడాలు ఎక్కువవుతున్నాయి. చోరీలతోపాటు గంజాయి విక్రయాలు కూడా విపరీతంగా పెరిగినట్లు ఇటీవల జరుగుతున్న ఘటనల ద్వారా తెలుస్తోంది.

> **నేరాలపై వేగంగా స్పందిస్తున్నాం**
>
> కావలిలో పట్టణంలో పోలీసులు ప్రజలకు కనిపించేలా విధులు నిర్వహిస్తున్నారు. వాటికి సంబంధించిన ఫొటోలు నిత్యం ఉన్నతాధికారులకు చేరేలా అప్‌లోడ్ చేస్తున్నాం. నేరాలు జరిగినప్పుడు వేగంగా స్పందిస్తున్నాం.
>
> – ఎం.వెంకటరమణ, డీఎస్పీ, కావలి

ఇటీవల జరిగిన ఘటనల్లో కొన్నింటిని పరిశీలిస్తే..

- కావలి పట్టణంలో ఫిబ్రవరి 23వ తేదీన ఓ వ్యక్తి గంజాయి మత్తులో 3వ తరగతి విద్యార్థినిపై బ్లేడ్‌తో దాడి చేసి గొంతు వద్ద తీవ్రంగా గాయపరిచాడు. గొంతు వద్ద బ్లేడుతో గాయపరిచిన వ్యక్తే, ఆ చిన్నారి ఇంటికి వెళ్లి తాను వేరొకరిని బ్లేడుతో కోయాల్సి ఉండగా, పొరపాటున మీ చిన్నారిని కోశానని నేరుగా తండ్రికే చెప్పాడు. దీంతో స్థానికులు అతనిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.
- గత నెలలో పట్టణంలోని మున్సిపల్ హైస్కూలులో ప్రొజెక్టర్‌కు చెందిన 7 ఇన్వర్టర్ బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. దీనిపై పాఠశాల నుంచి పోలీసులకు ఫిర్యాదు అందింది. అయితే పోలీసులు కేసు నమోదు చేయకుండా చేతులు దులుపుకున్నారు.
- ఇదే హైస్కూలులో ఈ నెల 12వ తేదీన ప్రొజెక్టర్‌కి చెందిన 13 ఇన్వర్టర్ బ్యాటరీలు మరలా చోరీకి గురయ్యాయి. మళ్లీ రెండోసారి ఫిర్యాదు చేయగా మున్సిపల్ అధికారుల ఒత్తిడి మేరకు రెండుసార్లు జరిగిన చోరీల్లో మొత్తం 20 బ్యాటరీలు చోరీ జరిగినట్లు కేసు నమోదు చేశారు
- పట్టణంలోని ఓ ఇంట్లో దొంగతనం జరిగి సొత్తు అపహరించగా బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఈ విషయాన్ని బాధితులు స్థానిక ప్రజాప్రతినిధికి తెలిపి ఆయన ద్వారా పోలీసులకు ఫోన్ చేసి విచారించాలని కోరినా వారు ఖాతరు చేయలేదు. దీంతో బాధితులు నేరుగా నెల్లూరుకు వెళ్లి ఎస్పీని కలిసి తమ గోడు చెప్పడంతో, ఎస్పీ ఆదేశాల మేరకు కావలి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- వసతిగృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలిరూరల్: ప్రభుత్వ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బీసీ వసతిగృహాన్ని సోమవారం రాత్రి ఎమ్మెల్యే సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులను వదిలి సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత వసతిగృహం అధికారులపై ఉందన్నారు. అలాగే విద్యార్థులు కూడా వారు చెప్పిన మాట వింటూ తమకు కావాల్సిన సౌకర్యాలను పొందాలని, బాగా చదివి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. గతంలో ఎక్కడా లేనివిధంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెట్టారని తెలిపారు. విద్యార్థులకు ఒక్క పైసా ఖర్చు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ప్రభుత్వమే మిమ్మల్ని చదివిస్తోందని తెలిపారు.

ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలి


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ప్రసాద్‌యాదవ్

కావలిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ తెలిపారు. కావలిరూరల్ మండలం చెన్నాయపాళెం, పెద్దపట్టపుపాళెం గ్రామాల్లో వలంటీర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సోమవారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు అభివృద్ధి చెందాలంటే సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కావలి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఉండాలని తెలిపారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుతో మత్స్యకారులకు భరోసా కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ ప్రాంత రైతుల కోసం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవులు, జేసీఎస్ కన్వీనర్ నాగన్నగారి శ్రీనివాసులు, మండల కమిటీ సభ్యులు నాయుడు రాంప్రసాద్, తుళ్లూరు శ్రీనివాసులు, కందుల శ్రీను, కొమరి రాజు, వి.తిరుపతి, చిమ్మిలి శ్రీహరి నాయుడు, పెదరాయుడు, చీకుర్తి కోటయ్య, ఓగిరాల సుధాకర్, వెంకటస్వామి, శ్రీను, చలపతి పాల్గొన్నారు.

నీటి వనరుల వద్ద హెచ్చరిక బోర్డులు


ప్రమాదాల నివారణపై యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సైలు

ఉదయగిరి: ఎస్పీ విజయారావు ఆదేశాల మేరకు మండలంలోని పలు నీటి వనరుల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు సీఐ గిరిబాబు, ఎస్సై ప్రభాకర్ సోమవారం తెలిపారు. ఈ మేరకు వారు మండలంలోని గండిపాళెం జలాశయం, పలు గ్రామాల్లోని చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి యువకులకు అవగాహన కల్పించారు. నీటి వనరుల్లో ఈత కొట్టడం ప్రమాదకరమన్నారు. చెరువులు, జలాశయాల్లో ఈత కొట్టడం నిషేధించామని, అందుకు వ్యతిరేకంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరువుల్లో ఈతకొట్టడం నిషేధం

మర్రిపాడు: మండలంలోని చెరువుల్లో యువకులు ఈతకొట్టడం నిషేధమని ఎస్సై విశ్వనాథరెడ్డి తెలిపారు. మండలంలోని డీసీపల్లి, నందవరం, రామానాయుడుపల్లి చెరువులను సోమవారం ఆయన పరిశీలించారు. చెరువుల్లో గుంతలు అధికంగా ఉన్నాయని, చెరువులు, సోమశిల ఉత్తరకాలువలో ఈతకు వెళ్లవద్దని సూచించారు. ఈ మేరకు చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆయన వెంట ఏఎస్సై శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పాలిసెట్-23 నోటిఫికేషన్ విడుదల


కావలిరూరల్: పాలిసెట్–2023 విద్యా సంవత్సరానికి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు, గతంలో ఉత్తీర్ణులైన వారికి పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సుశీల్‌కుమార్‌ప్రియ సోమవారం తెలిపారు. ఫిబ్రవరి 16వ తేదీ నుంచే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో లేదా రుద్రకోటలోని పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 10వ తరగతి పరీక్షల తర్వాత విశ్వోదయ బాలిక పాఠశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అనుభవం కలిగిన అధ్యాపకులతో పాలిసెట్ ఉచిత కోచింగ్ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాపూరు దాతృత్వం అభినందనీయం


విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

సోమశిల: అనంతసాగరం జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి 10వ విద్యార్థులకు ప్రతి రోజూ సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేయడం అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి మాటిరెడ్డి బాలకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని రేవూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ అనంతసాగరం మండలంలోని 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 293 మంది 10వ తరగతి విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారని, వీరు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రభుత్వం ప్రతి రోజూ సాయంత్రం ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేసిందని తెలిపారు. కాగా విద్యార్థులకు రాపూరు వెంకటసుబ్బారెడ్డి తన సొంత నిధులతో ప్రతి రోజూ సాయంత్రం ఓ మెనూ ప్రకారం అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి గడ్డి, ధాన్యం దగ్ధం


దగ్ధమైన వరి గడ్డిని పరిశీలిస్తున్న వీఆర్వో

ఉదయగిరి: మండలంలోని అర్లపడియలో సోమవారం ముటుకుందు చిన్నపరెడ్డి రైతు పొలంలో ప్రమాదవశాత్తు వరి గడ్డి, ధాన్యం దగ్ధమయ్యాయి. బాధితుడి వివరాల మేరకు తనకున్న ఒకటిన్నర ఎకరాలో వరి పంట సాగు చేశాడు. పంట కోసి పొలంలో ట్రాక్టరు సాయంతో నూర్పిడి చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి వరి గడ్డితోపాటు ధాన్యం పూర్తిగా దగ్ధమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపాడు. గ్రామస్తులు మంటలు అదుపుచేసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని వీఆర్వో మస్తాన్ పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

భూముల ఆక్రమణపై ఆందోళన

సీతారామపురం: మండలంలోని మారంరెడ్డిపల్లి పంచాయతీలో సర్వే నంబర్ 190–2లోని 6.32 ఎకరాల చాకలి మాన్యం భూములను దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలువురు రజకులు, ఎస్సీ కాలనీవాసులు సోమవారం ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇదిలా ఉండగా ఎన్నో ఏళ్లుగా రజకులు, దళితులు వారి నివాసాలకు దగ్గరగా ఉన్న భూములను పరస్పర అంగీకారంతో పెద్దల సమక్షంలో మార్చుకోవడం జరిగిందని, ఆ భూముల మీద ఓ టీడీపీ నేత కన్నుపడడంతో రజకులను రెచ్చగొట్టి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాడని దళితులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందాలి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందాలని స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 13వ వార్డులో గృహ సారథులు, సచివాలయ వార్డు కన్వీనర్లు, కార్యకర్తలతో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఎవరు ఎన్ని అభియోగాలు చేసినా వాటిని పట్టించుకోబోమని, కావలి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 13వ వార్డులోనే అయిదున్నర కోట్ల రూపాయలు పేదలకు అనేక సంక్షేమ పథకాల ద్వారా అందించామని గుర్తుచేశారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఏ ఇంటికి వెళ్లినా సీఎం జగనన్న ప్రభుత్వంలో తాము ఎంతో సంతోషంగా ఉన్నామంటూ అక్కచెల్లెమ్మలు నీరాజనాలు పలుకుతుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన మంచి పనులన్నీ ప్రజలకు తెలిసేలా గృహ సారథులు పనిచేస్తూ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా కృషి చేయాలని సూచించారు. మీ పరిధిలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనుమర్లపూడి వెంకట నారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, ఈతముక్కల బాలమురళీరెడ్డి, కనుపర్తి రాజశేఖర్, గంధం ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ఉంటాం

కావలిరూరల్: కావలి నియోజకవర్గంలో ముస్లింలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 31వ వార్డు పెద్దపావని రోడ్డులో ఉన్న ముస్లిం మైనార్టీల శ్మశాన వాటికను సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వారం రోజుల క్రితం ముస్లిం మత పెద్దలు తన వద్దకు వచ్చి 31వ వార్డులోని ముస్లిం శ్మశాన వాటికలో పెరిగిన చెట్లు తొలగించి శుభ్రం చేయించాలని కోరడంతో వెంటనే మున్సిపల్ అధికారులకు తెలిపి శుభ్రం చేయించామని తెలిపారు. అలాగే శ్మశానం వద్ద ఖాళీస్థలంలో కాంప్లెక్స్ ఏర్పాటు చేసేలా నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. ముస్లింలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి


క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

అనుమసముద్రంపేట: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆజాద్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు హమీద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో చంద్రశేఖర్ ఆజాద్ చేసిన పోరాటాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఇటీవల సంగం మండలం కొరిమెర్లలో నియోజకవర్గస్థాయిలో జరిగిన గ్రిగ్ క్రీడా పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరికృష్ణ, సుధాకర్‌రావు, అబ్దుల్ షరీఫ్, ఎండీ యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

ఆత్మకూరు: దేశానికి స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే ప్రాణాలను అర్పించిన చంద్రశేఖర్ ఆజాద్ చిరస్మరణీయులని వక్తలు కొనియాడారు. అఖిల భారత హిందూ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హిందూ మహాసభ ధర్మాచార్య పీఠస్థాన్ జాతీయ ప్రధాన కార్యదర్శి అతిదేశ్వరానంద పర్వత మహారాజ్ పాల్గొని ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో రాజరాజేశ్వరానందస్వామి, కె.మాధవనాయుడు, ఎ.మధుసూదనరావు, యు.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు కేంద్రం భారతదేశం

- సైకిల్ యాత్ర చేస్తున్న విదేశీయులు


సైకిల్ యాత్ర చేస్తున్న సలోన్, ఫిత్రో

ఆత్మకూరు: భారతదేశంలోని పట్టణాలు, పల్లెల్లోని ప్రజలు తప్పనిసరిగా సంప్రదాయాలను పాటిస్తున్నారని, భారతదేశం సంప్రదాయాలకు కేంద్రంగా వర్ధిల్లుతోందని, ఇలాంటి మంచి సంప్రదాయాలను తాము ఏ దేశంలోనూ చూడలేదని ఫిన్‌లాండ్ దేశానికి చెందిన సలోన్, ఫిత్రో తెలిపారు. తండ్రీ కొడుకులైన వీరిద్దరూ గత 50 రోజులుగా భారతదేశంలోని పలు ప్రాంతాల్లో సైకిల్ యాత్ర చేశారు. ఆదివారం రాత్రి ఆత్మకూరుకు వచ్చారు. సోమవారం మరోచోటకు సైకిల్‌పై వెళుతూ నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై విలేకరులతో మాట్లాడారు. తాము ఇప్పటికే 4 దేశాల్లో 40 వేల కిలోమీటర్లకు పైగా సైకిల్ యాత్ర చేసినట్లు తెలిపారు. తమకు మహారాష్ట్ర, గోవా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మంచి ఆదరణ లభించిందని, స్థానికులు ఎంతో ఆప్యాయంగా పలకరిస్తున్నారని తెలిపారు. సైకిల్ యాత్ర అనంతరం విమానంలో మరో దేశానికి వెళ్లి అక్కడ పర్యటించేలా ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలిపారు. మార్చి 16వ తేదీ వరకు భారతదేశంలో యాత్ర చేసి ఫిన్‌లాండ్‌కు వెళ్లనున్నట్లు తెలిపారు. భారత్‌లోని 10 చారిత్రాత్మక ప్రాంతాలు సందర్శించినట్లు తెలిపారు. అనంతరం వారు వైఎస్సార్ జిల్లా బద్వేలు వైపు వెళ్లారు.

ఈ-కేవైసీకి నేడు ఆఖరు

ఆత్మకూరు: రైతులు ఈ-కేవైసీ చేయించేందుకు మంగళవారంతో గడువు ముగుస్తుందని వ్యవసాయ అధికారి కిషోర్ తెలిపారు. స్థానిక మున్సిపల్ పరిధిలోని మూడు ఆర్‌బీకేలలో జరుగుతున్న ఈ-కేవైసీ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు.